ప్రజాశక్తి



నేటి నుంచి టోల్ బాదుడు

- సగటు 5 శాతం పెరుగుదల - వాహనదారులపై భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కొత్త ఆర్థిక సంవత్సరంలో టోల్ బాదుడు షురూ కానుంది. టోల్ గేట్ చార్జీలు సగటున 5 నుంచి 10 శాతం వరకూ పెరగనున్నాయి. దీంతో వాహనదారులపై భారం పడనుంది. ఈ పెరిగిన చార్జీలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి..

టోల్ ట్యాక్స్ పెంపు పేరుతో వాహన దారులపై మోడీ ప్రభుత్వం భారం వేయబోతోంది. టోల్ టాక్స్‌ను 5 నుంచి 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కర్నూలు నుంచి నంద్యాల వెళ్లి రావాలంటే 24 గంటల్లోపు రూ.500 పైగానే టాక్స్ కట్ అవుతుంది. నంద్యాల హైవే మీద వాహనాలు కర్నూలుకు వెళ్లాలంటే రెండు టోల్ గేట్లు దాటుకొని వెళ్లాలి. ప్రస్తుతం టోల్ గేట్ చార్జీ రూ.180 నుంచి 200 వరకు ఉంది. ఇప్పుడు 5 నుంచి 10 శాతం పెరగనుండడంతో వాహన దారులపై మరింత భారం అంటే రూ.500 పైగానే పడనుంది. దీంతో చూస్తే మరింత భారం పడనుంది. ఇప్పటికే వంట గ్యాస్ ధర పెంచడంతోపాటు పేద, మధ్య తరగతి ప్రజానీకంపై మోయలేని భారాలు వేసిన కేంద్రం ఇప్పుడు రవాణా రంగంపై పడింది. టోల్ గేట్ చార్జీలను ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం పెంచుతూ పోతోంది. ఈ ఏడాది కూడా ఏప్రిల్ నుంచి పెంచిన టోల్ టాక్స్‌లను వాహన దారుల నుంచి వసూలు చేయబోతున్నారు. ఈ చార్జీల పెంపుపై వాహనదారుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. టోల్ ట్యాక్స్ చార్జీలు పెరగడం వల్ల ప్రజలపైన భారం పడడమే కాకుండా నిత్యావసర ధరలు కూడా పెరుగుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఆర్‌టిసిపైన, ట్రాన్స్ పోర్ట్ రంగాలపైన కూడా తీవ్ర ప్రభావం చూపబోతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. టోల్ టాక్స్ పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పీపీపీ, హామ్ (హెచ్ఎఎం) పద్ధతిలో నిర్మించే రోడ్ల విషయంలో టోల్స్ వసూళ్లకు ఒక లెక్క ఉంటుంది! వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో ఒక స్ట్రెచ్ రోడ్డు నిర్మాణం జరిగితే, ఆ వెయ్యి కోట్ల రూపాయల వసూలు పూర్తయ్యాక.. అక్కడ టోల్ ఎత్తేయాలి. ఇలా నిర్మాణ వ్యయం వసూలైన రోడ్లపై కూడా టోల్స్ ఎత్తేసే ఉద్దేశం లేదని కేంద్రం స్పష్టం చేసింది.



గతేడాది కూడా...

గతేడాది వివిధ కేటగిరీ వాహనాలకు ఎనిమిది నుంచి 15 శాతం టోల్ చార్జీలను పెంచారు. ఈసారి కూడా 5 శాతం నుంచి 10 శాతం వరకూ చార్జీలను పెంచారు. దీంతో కేంద్ర ప్రభుత్వానికి టోల్ గేట్ల ద్వారా రెండు వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. గత ఏడాది టోల్ చార్జీలను పెంచడం ద్వారా రూ.1,820 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి లభించింది. ఎక్కువ మంది ఫాస్టాగ్ ద్వారానే చెల్లింపులు జరుగుతుండటంతో కచ్చితమైన ఆదాయాన్ని అంచనా వేయగలుగుతున్నారు.



కార్మికులకు వీడ్కోలు పలుకుతున్న నాయకులు

'చలో ఢిల్లీ'కి తరలి వెళ్లిన కార్మికులు

- వీడ్కోలు పలికిన నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మోడీ ప్రజావ్యతిరేక కార్మిక వ్యతిరేక రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న జంతర్ మంతర్ వద్ద జరిగే మహా ధర్నాకు కర్నూలు నగరం నుండి వందమంది కార్మికులు శుక్రవారం ఉదయం 12 గంటలకు నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌కు తరలివెళ్లారు. మహా ఉద్యమంలో పాల్గొనడానికి వెళుతున్న మహిళలు పురుషులకు ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నాయకులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకష్ణ, సిహెచ్ సాయి బాబా, ఎ. గోపాల్, ఎం. విజయ్, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి కె.రాజశేఖర్, సిఐటి యు ఓల్డ్ సిటీ నాయకులు కె.రాజగోపాల్, జి.ఏసు తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యకర్తలను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ 2024లో మోడీని గద్దె దించడం ద్వారా మాత్రమే దేశాన్ని రక్షించుకోగలుగుతామన్నారు. రానున్న కాలంలో రైతులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు, కార్మిక వర్గానికి సంక్షేమ చట్టాలు, చట్టాల పునరుద్ధరణ కోసం పెద్ద ఎత్తున రైతులను, కార్మికులను, వ్యవసాయ కూలీలను, ప్రజానీకాన్ని పోరాటాలలో భాగస్వామ్యం చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఢిల్లీ వెళుతున్న కార్యకర్తలకు నాయకులుగా సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, నరసింహులు, కె.సుధాకరప్ప నాయకత్వం వహించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : కమిషనర్

- స్వచ్ఛతోత్సవ ర్యాలీలో కర్నూలు నగరపాలక సంస్థ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యంతో నగర ప్రజలు ఉంటారని కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ అన్నారు. స్వచ్ఛతోత్సవ్ 2023లో భాగంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కమిషనర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. కర్నూలు నగరంలో శుక్రవారం స్వచ్ఛం మాషల్ మార్చ్ ర్యాలీని 52 వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛతను పాటించాలని తడి పొడి చెత్తను వేరు చేసి ఇంటికి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాల ని కర్నూలు నగరాన్ని స్వచ్ఛనకరంగా , చెత్త రహిత నగరంగా నిలిపేందుకు సహకరించాల ని కోరారు. స్థానిక ప్రజలతో, పాఠశాలలోని విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ సిబ్బంది , పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా చార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎన్‌హెచ్ఎఐ పెంచిన టోల్ ప్లాజా చార్జీలు రద్దు చేయాలని,పెట్రోల్ డీజిల్ రేట్లు తగ్గించి రవాణా రంగాన్ని ఆదుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, లాగ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ తో కలిసి కర్నూలు హైదరాబాద్ జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. పట్టణపౌర సంక్షేమ సంఘం నగర నాయకులు ఎం.నాగరాజు అధ్యక్షతన జరిగిన ఆందోళన నుద్దేశించి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, లాంగ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మినల్లా మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ రేట్లతో పాటు ప్రతి ఏటా టోల్ ప్లాజా చార్జీలు పెంచి రవాణా రంగంపై పగ పట్టినట్లుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు రవాణా రంగాలపై కోలుకోలేని విధంగా భారాలు వేస్తూ రవాణా రంగాన్ని దివాలా తీస్తున్న కేంద్ర ప్రభుత్వంపై జగన్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఈ రంగాన్ని కాపాడాలని కోరారు. లారీ యజమానులు సంఘం ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, లారీ ఓనర్స్ వైపి సీను, పల్సర్‌బాష ,మధు, చాందు, ఇపిఎస్ఎస్ నగర నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్, శ్రీనివాసరెడ్డి, రమణగౌడ్, శీను, సివి.వర్మ, మద్దిలేటి, రామాంజనేయులు పాల్గొన్నారు.



రహదారిని దిగ్బంధించిన నాయకులు

ఊళ్లుగా మారనున్న జగనన్న కాలనీలు : కలెక్టర్

ప్రజాశక్తి -కర్నూలు ప్రతినిధి

రాబోయే కాలంలో జగనన్న కాలనీలు ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే ఊర్లుగా మారే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పత్తికొండ మండలంలో జగనన్న లేఅవుట్, గ్రామ సచివాలయం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం బాలికల విద్యాలయం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పత్తికొండ మండలం చందోలి రోడ్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతి పై హౌసింగ్ డిఇ గురుప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మొత్తం లేఅవుట్ నందు 135 ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో బేస్‌మెంట్ లెవెల్ - 94, రూఫ్ లెవెల్ - 6, రూఫ్ కాస్ట్ - 7, పూర్తయిన ఇళ్లు - 6, బిలో బేస్‌మెంట్ లెవెల్ - 19, మిగిలిన 3 ఇళ్లు మొదలు పెట్టాల్సి ఉందని హౌసింగ్ డిఇ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో సుమారుగా 600 మంది బేల్దారులు ఉన్నారని, వారందరినీ సమన్వయం చేసుకొని ఇంటి నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్, ఎంపిడిఒలకు కలెక్టర్ సూచించారు. కాలనీలలో ఇంటి నిర్మాణాలు పూర్తయిన తర్వాత కాలనీలో రోడ్లు వేస్తామన్నారు. అదే విధంగా ఇంటి నిర్మాణాలు పూర్తయిన వాటికి వెంటనే మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

10వ తరగతి పరీక్షలు ఒత్తిడికి గురికాకుండా రాయండి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం బాలికల విద్యాలయం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను కలెక్టర్ సందర్శించి విద్యార్థినులతో సంభాషించారు. ఏప్రిల్ 3వ తేది నుండి 18వ తేది వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ విద్యార్థినులను ఉత్తేజ పరిచారు. పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని, పట్టుదలతో చదివితే కచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని ప్రోత్సహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం బాలికల పాఠశాలలో విజయవాడ నుండి విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు రాసే పరీక్షలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పదవ తరగతి రాసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వీక్షించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో తరగతి గదుల నిర్మాణం నాడు-నేడు పనుల వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

సిటిజన్ అవుట్ రీచ్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

పత్తికొండ మండలంలోని 6వ గ్రామ సచివాలయంలో హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్‌మెంట్ రిజిస్టర్, తదితర రికార్డులను జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు పరిశీలించారు. సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వర రావు ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా 10 నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు, సచివాలయ పరిధిలో ఉన్న గర్భిణీ స్త్రీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఎఎన్ఎంను కలెక్టర్ ఆరా తీశారు. హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించామని వివరించారు. కన్‌సిస్టెంట్ రిథమ్‌కు సంబంధించి ఈ సచివాలయ పరిధిలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయని, విజిట్‌కు వెళ్ళినప్పుడు ఏవైనా సమస్యలు కనిపిస్తే ఆన్‌లైన్ అప్లోడ్ చేస్తున్నారా లేదా అని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విజిట్ కి వెళు తున్నామని సమస్యలు కనిపిస్తే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నామని వివరించారు. ఫీవర్ సర్వేలో భాగంగా ఎంత మంది పరీక్షించారని, అదేవిధంగా రక్తహీనత కలిగిన మహిళలు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎఎన్ఎంకు జిల్లా కలెక్టర్ సూచించారు. సచివాలయంలో ఉన్న వాలంటీర్లు తప్పకుండా బయోమెట్రిక్ హాజరు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పత్తికొండ ఆడిఒ మోహన్ దాస్, పత్తికొండ తహశీల్దార్ విష్ణువర్ధన్, హౌసింగ్ డిఇ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

రంజాన్‌కు వ్యాపారస్తులకు అధికారులు సహకరించండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పండుగ నేపథ్యంలో వ్యాపారస్తులకు అధికారులు సహకరించాలని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ. హఫీజ్ ఖాన్ కోరారు. శుక్రవారం ఆయన నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పోలీస్ సిబ్బందితో, రిటైల్ షాప్ యజమానులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పండగకు ప్రభుత్వం అధికారులు పోలీసులు, మున్సిపల్ అధికారులు వ్యాపారస్తులకు సహకరించాలని కోరారు. కర్నూలు నగరంలోని రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా నగరంలోని ముస్లిం సోదరులు ఉపవాసాలలో పాల్గొన్న నేపథ్యంలో వారికి కావాల్సిన దుకాణదారులు సమయాన్ని పెంచుకొని వ్యాపారాలు చేసుకుని వారికి సహకరించాలని ఎమ్మెల్యే రిటైల్ వ్యాపారస్తులను కోరారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, సిఐలు, ఎస్ఐలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సి బెళగల్‌లో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎఒ మల్లేష్ కుమార్

నాణ్యతలేని ఎరువులు, మందులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-సి బెళగల్ : నాణ్యతలేని ఎరువులు, మందులు అమ్మితే చర్యలు తప్పవని ఎఒ మల్లేష్ కుమార్ సంబంధించిన దుకాణదారులకు హెచ్చరించారు. శుక్రవారం సి బెళగల్ లోని ఆయా ఎరువుల, మందుల గోడౌన్లను తనిఖీ చేసి స్టాకు వివరాలను పరిశీలించారు. క్రయ విక్రయాలలో బిల్లులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. మార్చి నెలలో ప్రతి స్టాకు గడువు తీరిందా లేదా చూసుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు.తయారీ గడువు ముగిసినచో కంపెనీలకు తిరిగి పంపించి కొత్త స్టాకు తెచ్చుకోవాలని నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏడు రోజుల పని దినాలను ఉపసంహరించుకోవాలి

ఎపిఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ముందు మీటర్ రీడర్స్ ధర్నా

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ మీటర్ రీడర్స్ పనిదినాలు 15 రోజుల ఏడు రోజులకు తగ్గించడాన్ని ఉపసంహరించుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం విద్యుత్ భవన్ ముందు ధర్నా చేశారు. మీటర్ రీడర్స్ జిల్లా అధ్యక్షులు బి.రాజు అధ్యక్షత జరిగిన ధర్నాలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీస్ రేటు రద్దు పరచి నెలవారి వేతనాలు అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్స్ వచ్చిన తరుణంలో మీటర్ రీడర్లకు సంస్థలోనే ప్రత్యామ్నాయం ఉపాధి కల్పనకు యాజమాన్యం వారు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో మీటర్ రీడర్లు 20 రోజులపాటు రీడింగ్ తీసేవారని, దానిని 14 రోజులు రీడింగు, 15 రోజులు కలెక్షన్ వసూలు చేయాలని చెప్పారన్నారు. వారు పనిచేసేటప్పుడు రోజుల్లో ఎలాంటి పండుగలు, పబ్లిక్ హాలిడేస్ వచ్చినా అత్యవసర పరిస్థితుల్లోనైనా కూడా సెలవులు తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. కొత్తగా 7వ తేదీ లోపు పూర్తి చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం ఒత్తిళ్లకు గురి అవుతున్నారన్నారు. ఏడు రోజులకు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలన్నారు. ధర్నా అనంతరం ఎపిఎస్‌పి డిసిఎల్ సిజిఎం, హెచ్‌ఆర్‌డి. వర కుమార్ ఎస్ఇ ఉమాపతికి వినతి పత్రాన్ని అందజేశారు. వారు స్పందిస్తూ ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మీ పనిని మీరు సక్రమంగా చేసుకుంటూ విద్యుత్ స్తంభాలను ఎక్కకూడదని ఆదేశించారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు సంస్థబాధ్యత వహించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాజు, జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ మీటర్ రీడర్స్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎపి మీటర్ రీడర్స్



ఐఎఎస్ఇ కళాశాల ప్రిన్సిపల్ గా ఆదినారాయణ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బి క్యాంపు లో ఉన్న ఐఎఎస్ఇ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఆర్. ఆదినారాయణ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గా సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి.సుబ్రహ్మణ్య కుమార్ వ్యవహరిస్తుండడంతో రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్.ఆదినారాయణ రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. ఆయనను కళాశాల అధ్యాపకులు కలిసి అభి నందనలు తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన అందేలా తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం

ప్రజాశక్తి-క్రిష్ణగిరి

క్రిష్ణగిరి మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో వెలసిన సీతారాముల గుడి ప్రాణాంగంలో శుక్రవారం బ్రాహ్మణుల చేత పచ్చ తోరణాలతో మామిడి ఆకులతో పందిరి వేసి సాంప్రదాయ బద్ధంగా పెళ్లికూతురు వైపు కొందరు పెళ్ళికొడుకు వైపు కొందరు నిలబడి వేదమంత్రాలతో సీతారాముల కళ్యాణ రథోత్సవం చెక్కభజన నంది కోళ సేవ భక్తిశ్రద్ధలతో వైభవంగా రథోత్సవాన్ని అంగ రంగ వైభవంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దస్తగిరి, రామచంద్రుడు, శివ రాముడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రబల రథ మహోత్సవం

క్రిష్ణగిరి మండలం గోకులపాడు గ్రామాలలో శ్రీరామ నవమి సందర్భంగా గ్రామ పెద్దల ఆధీనంలో ఘనంగా ప్రభల రథోత్సవం కార్యక్రమంలో భజంత్రీలతో నంది కోళ సేవ భక్తిశ్రద్ధలతో వైభవంగా రథాన్ని లాగుతూ ముందుకు కొనసాగారు. ఈ సర్పంచి చిన్న రామాంజనేయులు ఆధ్వర్యంలో భక్తులు పాల్గొన్నారు.





జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో నూతన కార్యవర్గం

బార్ అసోసియేషన్ ఎన్నికలు పూర్తి

అధ్యక్ష కార్యదర్శులుగా టి. నాగభూషణ నాయుడు, చక్రపాణి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం పూర్తయ్యాయి. నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా టి.నాగభూషణం నాయుడు, ఎంవి.చక్రపాణి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ ఎస్.షాబుద్దీన్, జాయింట్ సెక్రెటరీ ఎస్.లక్ష్మణ్, కోశాధికారి సయ్యద్ మహమ్మద్ షఫత్, లైబ్రరీ సెక్రెటరీగా వి.రవికుమార్, మహిళా ప్రతినిధిగా జాస్మిన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ విభాగం సెక్రటరీగా రాకేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి అత్యంత మెజార్టీతో గెలిచిపించిన న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో న్యాయవాదులకు ఎదురయ్యే అన్ని రకాల సమస్యల పరిష్కారానికి , వారి సంక్షేమానికి ఎల్ల వేల కృషి చేస్తామన్నారు. ఐక్యమత్యంతో ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన బార్ అసోసియేషన్ నాయకులను పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు అభినందించారు. అనంతరం స్వీట్లు పంపిణీ, బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఐలు జాతీయ కమిటి సభ్యులు కె.కుమార్, ఇతర సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ :

బుధవారపేటకు చెందిన వైసిపి నాయకులు వరలక్ష్మి తమ్ముడు మీసాల మధు బాబు మరణించిన విషయం మనకు తెలిసిందే. కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ బుధవార పేట్ కు చేరుకుని ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం దహన సంస్కారాలుకు రూ.10వేలు ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ శివమ్మ, వైసిపి నాయకులు వెంకటేశ్వరమ్మ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కేదార్నాథ్, వార్డ్ ముఖ్య నాయకులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తున్న హఫీజ్‌ఖాన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మల్లికార్జునరెడ్డి, కరిబసప్ప

'పది'లో మంచి ఉత్తీర్ణత సాధించాలి

- మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని కమ్మరచేడు మల్లికార్జునరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరిబసప్ప తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని కెజిబివి, కమ్మరచేడు, అరికేర, పెద్దహోతూరు, మొలగవల్లి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పదో తరగతి మోడల్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి రంగమ్మ కుమారుడు వీరేష్, ప్రధానోపాధ్యాయులు కరిబసప్ప, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు గిరి, కెజిబివి ఎస్ఓ సునీత బాయి మాట్లాడారు. ప్రతి విద్యార్థీ భవిష్యత్తులో ఏదైనా సాధించాలంటే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణ సాధించాలని తెలిపారు. ఉన్నత చదువుల్లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. కమ్మరచేడు మల్లికార్జున రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ... పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళన చెందకుండా విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ ఉపయోగపడే విధంగా ఎస్ఎఫ్ఐ పరీక్షలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్ష పట్ల శ్రద్ధ వహించి పరీక్షలు మంచిగా రాయాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మైనా, ఎస్ఎఫ్ఐ ఆలూరు మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు గిరిమూర్తి, నరసింహ పాల్గొన్నారు.

వికలాంగులకు 'ఐఫీడ్' చేయూత

ప్రజాశక్తి - ఆదోని



ఆర్థిక సాయం అందిస్తున్న డీఎస్పీ వినోద్ కుమార్

నెరణికి తండా గ్రామానికి చెందిన రెండు చేతులు లేని పి.అనిత బాయికు చదువుపై ఉన్న ఆసక్తిని గుర్తించిన ఐఫీడ్ ఫౌండేషన్ సంస్థల కార్యదర్శి బిటి.నరసింహులు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఆదోని డీఎస్పీ కార్యాలయంలో అందజేశారు. పుట్టుకతోనే రెండు చేతులు లేకున్నా అనిత ఆలూరులోని ప్రగతి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. తదుపరి చదువుకు అయ్యే ఖర్చులన్నీ తమ సంస్థ భరిస్తుందని నరసింహులు తెలిపారు. జీవితంలో ఏదైనా సాధించాలనే సంకల్పం ఉండాలేగాని వికలత్వం అడ్డుకాదని అనిత బాయి నిరూపించారని డీఎస్పీ పేర్కొన్నారు. సెక్రటరీని, ప్రోత్సహించిన తల్లిదండ్రులు కృష్ణనాయక్‌ను డీఎస్పీ అభినందించారు.

వేసవిలో నీరు ఎక్కువగా తాగాలి

- డాక్టర్ గోపీనాథ్ - వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

ప్రజాశక్తి - ఆదోని



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

వేసవిలో శరీరం నుంచి నీరు ఎక్కువగా బయటకు వెళ్తుందని, అందుకు నీటిని ఎక్కువగా తాగాలని వైద్యులు తెలిపారు. వేసవిలో జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు ఏర్పాటు చేసి పట్టణంలోని భాష్యం హైస్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. తక్కువ ఆహారం, ఎక్కువ నీరు తీసుకునేలా చూసుకోవాలని సూచించారు. ఆహారంలో స్పైసెస్, కారం, నూనె, మాంసాహారం తక్కువగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఎక్కువగా మజ్జిగ, పెరుగు, పండ్లు, పండ్ల రసాలు, కూరగాయలు తినాలని తెలిపారు. చిన్నపిల్లలు ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 6 గంటల తర్వాత బయటకు వచ్చి ఆటలు ఆడుకోవాలని సూచించారు. వదులుగా ఉండే లైట్ కలర్ దుస్తులు ధరించాలన్నారు. బయటికొచ్చినప్పుడు టోపీ, చేతి రుమాలు తలపై వేసుకోవాలన్నారు. రోజుకు రెండుసార్లు గోరువెచ్చటి నీరు గాని, చల్లటి నీటితో గాని స్నానం చేయడం మంచిదని తెలిపారు. భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కృష్ణమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, రీజియన్ ఛైర్మన్ ప్రసాదరావు, ఈసీ మెంబర్ గోవిందరావు, ప్రిన్సిపల్ సదాశివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ వేలంపై

ఆసక్తి చూపని వ్యాపారులు...

- పేరుకుపోయిన బకాయిలు - అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...

ప్రజాశక్తి-ఆలూరు



ఆలూరు పంచాయతీ కార్యాలయం

ఆలూరు మేజర్ పంచాయతీలో ఈ ఏడాది వేలం పాటలో వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. పంచాయతీ అభివృద్ధికి నిధులు లేక జనరల్ ఫండ్ నిధులతో కాలం వెళ్లబుచ్చుతూ సొంత నిధులు ఖర్చు పెడుతూ అప్పులు చేసి ఇబ్బంది పడుతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీలో వారపు, దినసరి, బస్టాండ్ తదితర వేలం పాటలతో వచ్చిన ఆదాయంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆలూరు మేజర్ పంచాయతీలో ఈ ఏడాది వేలం పాటలో వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. అధికారులు వేలం పాట ముందు కండిషన్‌గా వారంలోపు మొత్తం కట్టాలని చెబుతూ రూ.లక్షల బకాయి ఉండడంతో అధికారులపై నమ్మకం సన్నగిల్లుతున్నట్లు తెలిసింది.

పేరుకుపోయిన బకాయిలు : గత 2021-22, 2022-23 సంవత్సరం వేలం పాట దక్కించుకొన్న వారు మొత్తం రూ.24.70 లక్షలు బకాయి ఉన్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు. బి.ఎర్రిస్వామి రూ.7.61 లక్షలు, బుగులు శివశంకర్ రూ.3.55 లక్షలు, దళవాయి నాగమ్మ రూ.3.50 లక్షలు, బోయ గంగమ్మ రూ.10.04 లక్షలు పంచాయతీకి బకాయి ఉన్నారు. వీటితో పాటు పంచాయతీలోని ఓ అధికారి రూ.30 లక్షలు కాజేసినా, వాటిలో రూ.5 లక్షలు రికవరీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం రూ.50 లక్షలు పంచాయతీకి బకాయిలు రావాలి.

అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే : గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అండర్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని చెప్పిన నాయకుల మాటలు అటకెక్కాయి. పాత బస్టాండ్ నిత్యం జనం, వాహనాలు, పూలు, పండ్ల వ్యాపారులతో రద్దీగా ఉంటుంది. అక్కడ దుమ్ము, ధూళి ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పత్తికొండ, కోడుమూరు బస్టాండ్‌ల రూపురేఖలు మారాయి. మంత్రి నియోజకవర్గం ఆలూరులో కొత్తబస్టాండ్ ముళ్ల కంచెల నడుమ ఉండడం విశేషం. పంచాయతీ నిధులతో నిర్మించిన 27 దుకాణాలు మూలన పడ్డాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు, వ్యాపారులు ఆలూరు పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాదరణ ఉన్నంతవరకు ఎవరేమీ చేయలేరు

- జడ్‌పిటిసి విరుపాక్షి, వైసిపి యువ నాయకులు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజల్లో ఆదరణ ఉన్నంత వరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఎవరేమీ చేయలేరని జడ్‌పిటిసి విరుపాక్షి, ఎంపిపి భర్త, వైసిపి యువ నాయకులు జుటూరు మారయ్య తెలిపారు. శుక్రవారం నేమకల్లు గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు వారికి మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాల్మీకులకు పెద్దపీట వేస్తూ ఎస్టీ రిజర్వేషన్ సాధించుకునేందుకు జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి తోడుగా ఉండి వైసిపి అభ్యర్థులను గెలిపించుకోవడానికి కృషి చేయాలనియ కోరారు. మాజీ కన్వీనర్ ఓబులేసు, వాల్మీకి మండల నాయకులు లోకనాథ్, మాజీ ఎంపిటిసి మల్లికార్జున పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న జడ్‌పిటిసి విరుపాక్షి, వైసిపి యువ నాయకులు మారయ్య

మహిళా సాధికారత, సంక్షేమమే ధ్యేయం

- వైసిపి జిల్లా అధ్యక్షులు రామయ్య, ఎమ్మెల్యే ఎర్రకోట - వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మహిళల సాధికారత, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి జిల్లా అధ్యక్షులు, కర్నూలు మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని 565 గ్రూపులకు సంబంధించిన 5,822 మంది స్వయం సహాయక పొదుపు మహిళలకు రూ.3,48,45000 చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రలో డ్వాక్రా మహిళల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని రుణమాఫీని ప్రకటించారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు వారికి మూడో విడత చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం పొదుపు మహిళలతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రానున్న ఎన్నికల్లో మహిళలందరూ జగనన్నకు అండగా నిలబడి రాష్ట్రంలో తిరిగి వైసిపి అధికారంలోకి వచ్చేలా సహకరించాలని కోరారు. ఎంపిపి నసురుద్దీన్, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, వైసిపి కన్వీనర్ దొరబాబు నాయుడు, నాయకులు నాగేష్ నాయుడు, ఎస్‌బి.మన్సూర్, టి.బందేనవాజ్, కాశీరెడ్డి, టి.మురళీ నాయుడు, మహేశ్వర్ రెడ్డి, గాజులదిన్నె వెంకటేశ్వర రెడ్డి, భాస్కర్ రెడ్డి, గోవిందు, ఉస్మాన్, పద్మనాభం, రఫీక్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ నగేష్, వైకెపి ఎసి శ్రీనివాసులు, ఎపిఎం హేమలత, సిసిలు లలిత, సబీన పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని 11 వార్డుల్లోని పొదుపు మహిళలకు ఆసరా పథకం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. 14 ఏళ్లు పరిపాలించామని గొప్పలు చెప్పుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, స్టేట్ డైరెక్టర్లు మంజుల రేణుక, మస్తాన్, సలీం, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, కౌన్సిలర్లు సురేష్, ప్రతిభ, మహేశ్వరి, నాయకులు మజర్ అహ్మద్, సిఎచ్.నాగరాజ్, వాల్మీకి నారాయణ, పరిగల నారాయణ, పంపా రెడ్డి, మెప్మా ఆఫీసర్ వీరారెడ్డి, జావిద్, అనిత ఉన్నారు. **హాలహర్వి** హాలహర్విలోని ఆర్‌బికె వెనుక ప్రాంగణంలో వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ చేపట్టారు. స్త్రీ సంక్షేమ ఎపిఎం శివయ్య ఆధ్వర్యంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి పొదుపు గ్రూపు మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మండలంలోని 419 గ్రూపులకు రూ.2,70,94,000 వచ్చిందని తెలిపారు. ఆసరా పథకం ద్వారా మహిళలు అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అందరి గుండెల్లో ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపిడిఓ ఆంథోని, హాలహర్వి మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, జడ్‌పిటిసి లింగప్ప, ఎంపిపి నెట్టికంటమ్మ, వైస్ ఎంపిపి నాగేష్ పాల్గొన్నారు.



గోనెగండ్లలో చెక్కును పంపిణీ చేస్తున్న రామయ్య, ఎమ్మెల్యే ఎర్రకోట



ఆదోనిలో మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



హాలహర్విలో చెక్కు అందజేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

చంద్రబాబు, లోకేష్‌కు వాల్మీకులు తగిన బుద్ధి చెప్పాలి

- వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు తోవి నరసప్ప

ప్రజాశక్తి - కౌతాళం



వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసేందుకు నిరాకరించిన నారా లోకేష్‌కు, వాల్మీకులపై కపట ప్రేమ చూపుతున్న చంద్రబాబు నాయుడుకు తగిన బుద్ధి చెప్పాలని వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసప్ప తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో సోమందే పల్లి గ్రామంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసేందుకు నిరాకరించడం పట్ల ఆయన తప్పు పట్టారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి కేంద్రానికి పంపించినట్లు చంద్రబాబు నాయుడు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. కొంతమంది వాల్మీకి నాయకులు తమ స్వార్థానికి జగన్ ప్రభుత్వంపై, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని ఓడిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రాలయం గడ్డ రాంపురం రెడ్డి సోదరుల అడ్డా అని, ఆ కుటుంబాన్ని ఓడించడం ఎవరి వల్ల కాదని తెలిపారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొంది, నాలుగో సారి కూడా ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి పొందే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ వైసిపి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలో తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వాల్మీకులంతా ఐక్యంగా ఉండి జగన్మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- విద్యార్థులకు అట్టలు పంపిణీ

ఆస్పరి : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి, రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి ఆకాంక్షించారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. పదో తరగతి నుంచే కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సుజాత, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబు, సుంకన్న, మహేంద్ర, నరసప్ప, నవీన్, నాగేష్, ఓబులేసు, వీరేష్ పాల్గొన్నారు.

బహిర్భూమికి ఎటు వెళ్లాలి

- గవిగట్టు మహిళల ఆవేదన

పెద్దకడబూరు : మండలంలోని గవి గట్టు గ్రామంలో బహిర్భూమికి వెళ్లడానికి ఇబ్బందులు ఉన్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మహిళలు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో మహిళలు బహిర్భూమికి వెళ్లాలంటే ఎటు పోవాలని ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ మరుగు దొడ్డి కట్టించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు బహిర్భూమి కోసం బయటికి వెళితే ఆత్మ గౌరవం ఎక్కడ ఉంటుందని అధికారులు, నాయకులను ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి కట్టించి ఇవ్వాలని కోరారు. సర్పంచి మాట్లాడుతూ... మహిళలకు బహిర్భూమికి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. వీలైనంత త్వరగా ఏర్పాట్లు చేయాలని, లేకపోతే రాజకీయ నాయకులు ఎవరు వచ్చినా నిలదీస్తామని మహిళలు హెచ్చరించారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

- పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లా

దేవనకొండ : పంచాయతీ అభివృద్ధికి సభ్యులు, ప్రజలు సహకారం అందించాలని పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లా కోరారు. శుక్రవారం సర్పంచి సవారమ్మ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటి, కుళాయి పన్ను వంద శాతం లక్ష్యం చేరుకునేలా ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామంలోని చెరువులకు వేలం పాటలు త్వరలో నిర్వహిస్తామన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత లేకుండా పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

వాల్మీకుల గుండెచప్పుడు వినిపిద్దాం

- వైసిపి జిల్లా అధ్యక్షులు రామయ్య - వాల్మీకులకు న్యాయం జరుగుతుందన్న ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 2న కర్నూలు వేదికగా రాష్ట్రానికి వాల్మీకుల గుండెచప్పుడు వినిపిద్దామని వైసిపి జిల్లా అధ్యక్షులు, కర్నూలు మేయర్ బివై.రామయ్య కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే ఎర్రకోట నివాసంలో బివై.రామయ్య, ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి మాట్లాడారు. ప్రజా సంకల్ప యాత్ర జిల్లాలో ప్రవేశించినప్పుడు వాల్మీకులు జగన్మోహన్ రెడ్డిని కలిసి గోడును వినిపించుకున్నారని తెలిపారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారని చెప్పారు. వాల్మీకులకు త్వరలోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. కర్నూలులో ఆదివారం జరిగే వాల్మీకుల మహా ప్రదర్శనకు నియోజకవర్గం నుంచి వాల్మీకులు పెద్దఎత్తున హాజరవుతారని చెప్పారు. అనంతరం బివై.రామయ్య మాట్లాడారు. దశాబ్దాల తరబడి వాల్మీకులు నిరీక్షిస్తున్న ఎస్టీ హోదా కలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సాకారం చేయబోతున్నారన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతగా, రాష్ట్ర ప్రజలకు వాల్మీకుల గుండెచప్పుడు వినిపిద్దామనే ఉద్దేశంతో ఆదివారం కర్నూలులోని వాల్మీకి విగ్రహం వద్ద వాల్మీకుల మహా ప్రదర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వాల్మీకులంతా తరలిరావాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, గోనెగండ్ల నాగేష్ నాయుడు, పెట శ్రీనివాస్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ఛైర్మన్ రియాజ్ అహ్మద్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యుకె.రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య, ఎమ్మెల్యే ఎర్రకోట

ఘనంగా ఐజాక్ న్యూటన్ వర్ధంతి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలోని దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐజాక్ న్యూటన్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఐజాక్ న్యూటన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్ ఐజాక్ న్యూటన్ చిన్నతనంలో యాపిల్ పండు చెట్టుపై నుంచి పడడంతో ఉదయించిన ప్రశ్న వల్ల మానవ సమాజానికి కొత్త వైజ్ఞానిక బాటలు వేశారని తెలిపారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.శంకరయ్య మాట్లాడారు. సమాజం ఒకవైపు పురోగమిస్తున్నా, మరోవైపు అంధ విశ్వాసాలు, మూఢనమ్మకాలతో కొట్టుమిట్టాడుతోందని తెలిపారు. సమాజం అభివృద్ధి చెందాలంటే శాస్త్రీయ విజ్ఞాన వ్యాప్తి ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అందుకు దేశంలో ప్రతి పౌరుడు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, ఆలోచన రేకెత్తించేటట్లు, సత్యాన్వేషణ కోసం చిన్నప్పటి నుంచే కృషి చేసి వైజ్ఞానిక సమాజం ఏర్పాటులో భాగం కావాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్యామల, వెంకటలక్ష్మి, కళావతి, మైథిలి, కౌసర్, రాజీ, భీమేష్, వెంకటేష్, నవీన్ కుమార్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, జగదీష్ పాల్గొన్నారు.



న్యూటన్ చిత్రపటానికి పూలమాలు వేస్తున్న ఉపాధ్యాయులు

సిఐటియు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆటో యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, పోలీసు కానిస్టేబుల్ రామచంద్ర చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఆర్‌టిసి బస్టాండ్ నుంచి గ్రామాలకు ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారని తెలిపారు. వేసవి కావడంతో తాగునీరు లేక ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆటో యూనియన్ నాయకులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. గత 4, 5 ఏళ్ల నుంచి ఆటో డ్రైవర్లు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. వీరేష్, ఆటో యూనియన్ నాయకులు నాగరాజు, ఎల్లప్ప, ఈరన్న, స్వామి, సుధా, బాష పాల్గొన్నారు.

రమణీయం... రథోత్సవం..

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీరామనవమి పండగ సందర్భంగా బదినేహాళ్, బుడమల దొడ్డి గ్రామాల్లో రథోత్సవం వైభవంగా సాగింది. శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశేష జన వాహిని మధ్య రథోత్సవం నిర్వహించారు. బుడుమల దొడ్డి ఆంజనేయస్వామి దేవాలయంలో పూజల అనంతరం భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా రథోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వైసిపి నాయకులు అత్రి గౌడ్, వీరభద్ర గౌడ్, శివారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత నాకేష్ రెడ్డి, రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఆకట్టుకున్న తేరు బొమ్మలాట

వైభవంగా సీతారాముల కల్యాణ రథోత్సవం

ప్రజాశక్తి - చిప్పగిరి




నేమకల్లులో సీతారామ కల్యాణ రథోత్సవం

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని నేమకల్లు గ్రామంలో సీతారాముల కల్యాణ రథోత్సవం కనుల పండువగా సాగింది. శుక్రవారం వేకువజామునే వేద పండితులు బెల్డోనా రామనాథ శాస్త్రి స్వామి, రాము స్వామి ఆధ్వర్యంలో సీతారాములు కొలువై ఉన్న దేవాలయంలో రామ, లక్ష్మణ, సీతమ్మ ప్రతిమలకు ప్రత్యేక అలంకరణ చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు తలంబ్రాలు ముగిశాయి. అనంతరం స్వాముల వారి ప్రతిమలను రథంపై అధిష్టించి మడక రథోత్సవం నిర్వహించారు. వచ్చిన భక్తులందరూ స్వాముల వారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య సీతారాముల కల్యాణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తోలు బొమ్మల నృత్యం, కోలన్నలాట పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా జడ్‌పిటిసి వీరుపాక్షి, ఎంపిపి భర్త, వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచి ప్రేమ్ కుమార్, గ్రామ పెద్దలు, ప్రజలు ముందుండి రథోత్సవాన్ని నడిపించారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

శ్రీగిడ్డాంజనేయ స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

మండలంలోని తారాపురంలో గ్రామంలో వెలసిన శ్రీ గిడ్డాంజనేయ స్వామి హుండీ లెక్కింపును శుక్రవారం ఆలయ అధికారి రాంప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టారు. శ్రీభ్రమరాంబిక సేవా సమితి సేవకులు, ఆలయ అర్చకులు స్వామివారి హుండీని లెక్కించారు. 2022 నవంబర్ నుంచి 2023 మార్చి వరకు భక్తులు చెల్లించిన కానుకలను లెక్కించినట్లు ఆలయ అధికారి రాంప్రసాద్ తెలిపారు.





చల్లా ఆఫీస్ వద్ద గుమ్మి కూడిన ప్రజలు

'జలం'పై గళం

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నీటి సమస్యపై తీవ్ర చర్చ - అధికారులపై కౌన్సిల్ సభ్యులు నిరసన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

"నీటి సమస్యతో వార్డుల్లో ప్రజలు అల్లాడి పోతున్నారు. అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు.. మీరైనా స్పందించండి" అంటూ స్వపక్షం, విపక్షం కౌన్సిల్ సభ్యులు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి ముందు వాపోయారు. శుక్రవారం జరిగిన నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో స్వపక్షం సభ్యులే వార్డుల్లో నెలకొన్న త్రాగు నీటి సమస్యల పైన గళమెత్తరు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ షేక్ మాబున్నీసా అధ్యక్షతన జరుగగా సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో అజెండాలోని అంశాలన్ని ఎలాంటి చర్చ లేకుండనే కౌన్సిల్ ఆమోద ముద్ర పడింది. అనంతరం కౌన్సిల్ సభ్యులు వారి వార్డుల్లో తలెత్తిన నీటి సమస్య పైననే మాట్లాడారు. ఎప్పటిలోగా ప్రజలకు రెగ్యులర్ గా నీళ్లు ఇస్తారో చెప్పాలని, నీళ్లు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సభ్యులు అధికారులపై నిరసన గళం విప్పారు. వార్డులో నీళ్లు రాకపోవడంతో ప్రజలు ఇంటి వద్దకు వచ్చి నిలదీస్తున్నారని దీనితో ప్రజలకు సమాధానం చెప్పలేక ఏడ్చుకుంటూ కూర్చున్నానని 17వ వార్డుకు చెందిన మహిళా కౌన్సిలర్ వాపోయారు. పనులు మంజూరై నెలలు గడుస్తున్నా వార్డులో డ్రైనేజి కాలువల పరిస్థితి దయానీయంగా ఉందని కౌన్సిలర్ శ్యాం సుందర్ లాల్ సమావేశం దృష్టికి తెచ్చారు. 21వ వార్డులో ఓ ఇంటికి కొళాయి లేకున్నా పన్ను కట్టాలని ఆ ఇంటి యజమానికి మున్సిపల్ అధికారులు నోటీసులు పంపారని అ వార్డు కౌన్సిలర్ చెరుకు శ్రీదేవి ప్రస్తావించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి

తాగు నీటి సరఫరా విషయంలో ప్రజలకు ఇబ్బది కలిగించే మున్సిపల్ సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే రవి చంద్ర కిశోర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డిని ఆదేశించారు. ఈ మూడు నెలలు చాలా కీలకమని, ప్రజలకు ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండ చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య పైననే దష్టి సారించాలని, అధికారులు రెగ్యులర్‌గా క్షేత్రస్థాయిలో తిరుగుతూ పట్టణంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోగా నంద్యాలను మరింత అభివృద్ధి చేస్తామని, నంద్యాల రూపురేఖలే మారుస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ ఏర్పాటుకు కషి చేస్తున్నామని, ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు వాటి కెపాసిటీని పెంచ బోతున్నట్లు తెలిపారు. పట్టణంలో పార్కుల అబివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

కౌన్సిల్ సమావేశామా మజాకా..

నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సాధారణ నిధులతో పలు అభివద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయడంతో పాటు, మున్సిపల్ చైర్ పర్సన్ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ ఇంజనీర్ పట్టణంలో రోజువారి తనిఖీలు చేయడానికి గుంటూరు విజయవాడలో జరిగే అధికారుల సమీక్ష సమావేశాలకు వర్క్ షాప్‌లకు వెళ్లడం కోసం సంవత్సర కాలంలో అద్దె ప్రతిపాదికన నెలకు 35 వేల చొప్పున మూడు వాహనాలకు రూ.12.60 లక్షలు, వీధి కుక్కలను పట్టుకొనేందుకు వేయి కుక్కలకు రూ.16.50 లక్షలు ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం పొందింది.



మరోసారి భగ్గుమన్న విభేదాలు

- చల్లా శ్రీలక్ష్మి అనుచరులపై దాడి - పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి - అవుకు

చల్లా రామకృష్ణారెడ్డి కుటుంబంలో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. రామకృష్ణారెడ్డి చిత్రపటం కోసం మొదలైన గొడవ ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం వరకూ వెళ్లింది. చల్ల విగ్నేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి చల్లా శ్రీలక్ష్మి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయం శ్రీలక్ష్మికి తెలియడంతో తన పార్టీ ఆఫీసులో అనుమతి లేకుండా ఏ విధంగా విలేకరుల సమావేశం నిర్వహిస్తారంటూ కుటుంబ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఒకరికొకరు దుర్భాషలాడుకుంటూ ఉండగా కుటుంబ సభ్యులు కొందరు చల్లా శ్రీలక్ష్మిపై, అనుచరులపై దాడి జరిగినట్లు శ్రీలక్ష్మి అనుచరులు తెలిపారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను శాంతింప చేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో కుటుంబ సభ్యుల్లోని కొందరు మహిళలు ఉండడంతో పోలీసులు వారిని వారించ లేకుండా చూస్తూ ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం అక్కడికి బనగానపల్లె ఎస్సై రామిరెడ్డి, అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మహిళా పోలీసులతో ఇరువర్గాలను అదుపు చేశారు. చల్లా కుటుంబంలోని విభేదాలు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డితో



గొడవ పడుతున్న వారిని ఆపుతున్న పోలీసులు

కలిసి చల్లా కుటుంబం వద్దకు చేరుకొని కుటుంబ సభ్యులతో చర్చించారు. ఇరువురితో వేరువేరుగా చర్చలు జరిపారు. చల్లా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ తాను అవుకు పట్టణాన్ని వదిలి వెళ్లాలని కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని, అవుకు పట్టణాన్ని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతూ చల్లా కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేసే వ్యక్తులను ఎన్నటికీ సహించమన్నారు. పోలీసులు చల్లా నివాసం వద్ద గట్టి బందోబస్తును నిర్వహిస్తున్నారు.

చల్లా కుటుంబంలోని ఇరుగ్రూపులపై కేసు నమోదు : ఎస్ఐ

దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి కుటుంబంలో ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసినట్లు అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. చల్లా శ్రీ లక్ష్మీకి చెందిన నలుగురిపై, చల్లా విగ్నేశ్వర్ రెడ్డికి చెందిన 9 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

మోడీ విధానాలను ప్రతిఘటిద్దాం

- చలో ఢిల్లీకి బయలుదేరిన ప్రజా సంఘాల నాయకులు, రైతులు, కార్మికులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

దేశ సంపదను, ప్రకృతి వనరులు, ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ కార్మిక కర్షక కష్టజీవుల మీద భారాలు మోపుతున్న మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ నెల 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు శుక్రవారం ఆత్మకూరు నుంచి ఢిల్లీకి బయలుదేరిన రైతులకు వీడ్కోలు చెబుతూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా (మిగతా 6వ పేజీలో..)



ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, కార్మికులు, నాయకులు



రంజాన్ వేళలు

శనివారం
ఇఫ్తార్ : 6 : 36

ఆదివారం
సహేరి : 4 : 50

అట్రాసిటీ కేసులపై కాలయాపన తగదు

- పరిష్కారం వేగవంతం చేయాలి : కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డితో కలిసి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్, డిఆర్ఒ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా జిల్లా ఏర్పాటైన గతేడాది 2022 ఏప్రిల్ 4 నుండి డిసెంబర్ 31 వరకు 69 కేసులు రిజిస్టర్ కాగా ఇందుకు సంబంధించి 102 మంది బాధితులకు ఎఫ్ఐఆర్ నమోదైన వాటికి రూ.24.50 లక్షలు, చార్జ్ షీట్ అయిన వాటికి రూ.81.75 లక్షలు వెరసి మొత్తం 1.6 కోట్లు పరిహారం చెల్లించామన్నారు. అలాగే 1-1-2023 నుండి 25-3-2023 వరకు జిల్లాలో 62 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో 21 కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైన వాటికి రూ.52.93 లక్షలు, చార్జ్ షీట్ అయిన వాటికి రూ.83.12 లక్షలు వెరసి మొత్తం 1.36 కోట్లు పరిహారం చెల్లించామన్నారు. పెండింగ్లో ఉన్న కేసులపై సంబంధిత అధికారుల నుండి నివేదికలు తెప్పించుకొని సత్వరమే పరిష్కరించి నష్టపరిహారాన్ని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఒను ఆదేశించారు. ఎంప్లాయిమెంట్ నిమిత్తం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత ప్రతిపాదనలను కర్నూలు జిల్లా కేంద్రానికి పంపాలన్నారు.జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జీవన్ రాజు, రమేష్, చిటికల సలోమి, దిలీప్ రాజు, అశోక్ నాయక్, మమత, శ్రీనివాసులు సూచించిన మేరకు అన్ని మండలాల్లోని ఎస్సీ కాలనీలకు స్మశాన వాటికలకు స్థలాలను గుర్తించి నివేదికలు తెప్పించుకోవాలని డిఆర్ఒకు సూచించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన బాధిత కుటుంబాల్లో అర్హులైన వారికి అసైన్డ్ భూములు, 90 రోజుల ఇళ్ల పట్టాల కింద ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కస్తూరిబా బాలికల పాఠశాలల్లో మెనూ ప్రకారం ఆహార పదార్థాలు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ సెక్టోరల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 42 చెంచు గూడెంలకు సీనియర్ అధికారులకు మౌలిక వసతుల కల్పనపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించామని, రాగానే సంబంధిత ఏర్పాట్లపై తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. అంబేద్కర్ విగ్రహ మార్పునకు సభ్యులు సూచించిన స్థలాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన విచారణలో సాక్షులు సహకరించాలని సూచించారు. ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాలలో పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ సరిగా జరగలేదని, విజిలెన్స్‌కు పంపించాలని డ్వామా పిడికి సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి సభ్యులు ప్రతి కేసుపై క్షుణ్ణంగా అవగాహన పొంది సంబంధిత అంశంపై వినతి పత్రంతో సమావేశానికి రావాలన్నారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతినెల 30వ తేదీ పౌర హక్కుల దినోత్సవం జరపాలని కలెక్టర్‌ను కోరారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరగా చర్యలు తీసుకోవాల్సిందిగా డిఆర్ఒకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సివిల్ సప్లై డిఎం రాజునాయక్, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జయన్న, సంక్షేమ శాఖ డిడి చింతామణి, నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ల డిఎస్పీలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



తాత్కాలిక బస్ షెల్టర్, చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

తాత్కాలిక బస్ షెల్టర్, చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలో ప్రయాణికుల సౌకర్యార్థం బేతంచెర్ల రోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ షెల్టర్, చలివేంద్రంను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బస్ షెల్టర్, చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్, వైస్ చైర్మన్ ఎస్ఎండి.జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు బుర్రు రమాదేవి, మహేశ్వర రెడ్డి, వైసిపి నాయకులు శ్రీధర్ నాయుడు, జహీర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం కోర్టు ఆవరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. న్యాయవాదులు బార్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గొడుగు రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎస్ మహబూబ్ బాషా, జాయింట్ సెక్రెటరీ హుస్సేన్ మియా, లైబ్రరీ పెరుమాల చింతలయ్య, ట్రెజరర్ కే లక్ష్మీనారాయణ, మీడియా సెక్రటరీ ప్రాతకోట భాస్కర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ ఎలక్షన్ ఆఫీసర్‌గా పుల్లారెడ్డి, నూర్ అహ్మద్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కంచర్ల గోవింద్ రెడ్డి, నాగిరెడ్డి, పేరయ్య చౌదరి, అబ్దుల్ కలాం, మాణిక్యరావు, వేముల వెంకటేశ్వర్లు, గిరి రాజు, అబ్దుల్ రబ్ ఆసిఫ్, అలీఖాన్ సిద్దిక్ అహ్మద్, బతుకులయ్య, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, శివశంకర్, బలరాము నాయక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజలను దోపిడీ చేస్తున్న పాలకులు : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

టోల్ టాక్స్, విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దోపిడీ చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు విమర్శించారు. శుక్రవారం నందికొట్కూరులోని సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి ప్రజలపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ, పెట్రోలు, డీజలు, వంటగ్యాస్, విద్యుత్ చార్జీలు పెంచిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇంటి, చెత్త పన్ను, ఆర్టిసి చార్జీలు పెంచి భారాలు వేసిందని, తాజాగా కేంద్ర ప్రభుత్వం శ్రీరాముని శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలపై పనులు వేసిందన్నారు. టోల్ టాక్స్ 200 నుండి 500 రూపాయల పెంచడం వల్ల రవాణా రంగంపై, ఆర్టిసిపై ప్రభావం పడుతుందన్నారు. ఫోన్ పే ద్వారా ట్రాన్సాక్షన్ జరిగితే వేయి రూపాయలకు 10 రూపాయలు వసూలు చేసేందుకు రూల్స్ తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచలేదని ఒకవైపు నోటిఫికేషన్ జారీ చేస్తూ మరోవైపు సర్దుబాటు చార్జీల పేరుతో గత సంవత్సరం 1400 కోట్లు వసూలు చేశారని, 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్తుకు ఇప్పుడు 36 నెలల పాటు యూనిట్కు 25 పైసలు చొప్పున రూ.2900 కోట్లు వసూలు చేశారన్నారు. మళ్లీ 2023 నుండి యూనిట్కు 65 పైసలు చొప్పున ఏప్రిల్ నుంచి రూ.3083 కోట్లు ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున భవిష్యత్తులో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు కె.భాస్కర్ రెడ్డి, పి.ఫకీర్ సాహెబ్, ఎస్.రామసుబ్బయ్య పాల్గొన్నారు.



ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం

ప్రజాశక్తి - పగిడ్యాల

గ్రామీణ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని ఎంపిడిఒ వెంకటరమణ, సర్పంచి పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం పగిడ్యాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బస్ స్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎండలు అధికం కావడంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారని, వారి దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి పుల్లయ్య, ఎంఇఒ సుభాన్, కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శేఖర్, పల్లె సత్యనారాయణ రెడ్డి, పొన్నూరు రాజశేఖర్ రెడ్డి, దొంతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పగిడ్యాలలో చలివేంద్రంను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు



వైభవంగా ముగిసిన నవమి వేడుకలు

ప్రజాశక్తి - సిరివెళ్ల

మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఆలయంలో విశేష పూజల అనంతరం సీతారాముల కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం కన్నుల పండుగా నిర్వహించారు. సర్పంచి కందుల మల్లీశ్వరి ప్రసాద్ రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి కందుల ప్రసాద్ రెడ్డి, ఉప సర్పంచ్ రెడ్డి, మాజీ ఉప సర్పంచి పి.తిరుపతిరెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డిలు గ్రామోత్సవాన్ని, అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించి ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హామీనిచ్చారు. శుక్రవారం చాగలమర్రి మండలంలోని పెద్దవంగలి గ్రామంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా రామాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే గంగుల నానికి నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాతిదూలం పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నా, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను చూసేందుకు హుటాహుటిన నియోజకవర్గానికి వచ్చి పరిశీలించి రైతులను పరామర్శించామన్నారు. పంట నష్టం వివరాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకరాగా ఈ క్రాప్ బుకింగ్‌కు సంబంధం లేకుండా ఆదుకుంటామని హామీనిచ్చారని తెలిపారు. వర్షాల వల్ల రైతులు నష్టపోయిన విషయాన్ని అసెంబ్లీలో సిఎం దృష్టికి తీసుకెళ్లినా మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మతిస్థిమితం లేకుండా మాజీ మంత్రి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు మున్నయ్య తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారు షరీఫ్, ఎంపిపి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతి ఉపసర్పంచి షేక్ సోహెల్ ,ట్వైస్ ఎంపిపి రఫి, ఎంపిటిసిలు లక్ష్మిరెడ్డి, పత్తి నారాయణ, మాజీ జెడ్పిటిసి రామగురివి రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, ఉప సర్పంచ్ బాలనరసింహులు, మాజీ సర్పంచ్‌లు నరసింహులు, నర్సయ్య, వైసిపి నాయకులు మాజీ సర్పంచ్ పుల్లయ్య, గౌస్‌పీరా, వెంకట్రామిరెడ్డి, బియ్యం షబ్బీర్, కమాల్, వెంకటేశ్వర్రెడ్డి, నరసింహా రెడ్డి, ముల్లా ఖాదర్ భాష, జబ్బార్, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

తాటి చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని నరసాపురం గ్రామ సమీపంలో తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి బాల లింగమయ్య(38) మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులవివరాల మేరకు ముత్తలూరు గ్రామానికి చెందిన బాల లింగమయ్య అత్తగారి ఊరు నరసాపురంనకు వెళ్లి రోజు తాటి ముంజలు కోసి వాటిని విక్రయించి జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రోజు మాదిరిగానే తాటిచెట్టు పైకి ఎక్కి ముంజలు కోస్తూ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. దీంతో అతనికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన కొందరు విషయాన్ని అతడి బంధువులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకుని బాల లింగమయ్యను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. అతనికి భార్య రవణమ్మ, కుమారుడు డేవిడ్, కుమార్తె నిరీక్షణ ఉన్నారు. పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు నిరుపేద కావడంతో అతని కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరారు.



మృతి చెందిన బాల లింగమయ్య

సమతుల ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పాములపాడు

కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, జడ్పిహెచ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వెంకట సుబ్బమ్మ పేర్కొన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జడ్పిహెచ్ హైస్కూల్‌లో బాలికలకు చిరుధాన్యాలు తీసుకోవడం, వాటి ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్లు లలితా ప్రభావతి, అంజలి దేవి సమక్షంలో చిరుధాన్యాల ప్రదర్శన, వివిధ రకాల పోషక విలువల వంటకాలు అంగన్వాడి టీచర్లు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించేందుకు వయసుకు తగిన బరువు, బరువుకు తగిన ఎత్తు సమానంగా ఎదుగుదల ఉండాలంటే బాలికలు విటమిన్లు లభించే ఆహారంతో పాటు చిరుధాన్యాలు కూడా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భోజన సమయంలో చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఝాన్సీ, ఏఎన్ఎం ఎంఎస్కే, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.





భూమి పూజ చేస్తున్న పోతిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి

ధోబీ ఘాట్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని బెలుం గ్రామంలో రజకులకు ధోబి ఘాటు నిర్మాణం కోసం పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవాసమితి తరుపున సమితి అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అలాగే ముస్లింలకు, ఎస్సిలకు వారి స్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడి చిన్న కుమారుడు పోతిరెడ్డి మహేంద్ర రెడ్డి, మాజీ సర్పంచ్ చేరెడ్డి నాగిరెడ్డి, పి సాయినాథ రెడ్డి, పి విష్ణు వర్ధన్ రెడ్డి, బి పెద్ద సాయిబాబా, రజకులు, మారం చిన్న ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని కంబాలపల్లి గ్రామం వద్ద మోటార్ సైకిల్ అదుపు తప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేంపెంట గ్రామానికి చెందిన బి.రవి(36) మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. వేంపేటకు చెందిన రవి మోటార్ సైకిల్‌పై వెళుతూ అదుపుతప్పి కంబాలపల్లె వద్ద ఉన్న బోర్డును ఢీకొన్నాడు. దీంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అతడిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చరాదు

ప్రజాశక్తి - ప్యాపిలి

వాల్మీకి, బోయ, బంతి కులాలను ఎస్‌టిలో చేర్చరాదని ఎరుకలి సంఘం నాయకులు శేఖర్, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సంఘం నాయకులు శుక్రవారం జీవో 52కు వ్యతిరేకంగా నిరసన తెలియజేసి తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఎస్టీలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశు, రమేషు, సీతారాముడు, కిట్టు, రవి, బాలకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి కష్టాలు తీర్చాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణ ప్రజలకు తాగు నీటి కష్టాలు తీర్చాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవికాలం మొదలైనప్పటి నుండి నంద్యాల పట్టణంలోని 42 వార్డులలో నివసించే ప్రజలు నీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మిగతా వేసవికాలం అంతా ఎంత ఇబ్బందులు ఎదుర్కొంటారో అర్థమవు తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు. ప్రజాప్రతినిధులు పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

శాంతి రథం ప్రారంభం

ప్రజాశక్తి - పాణ్యం

మానవతా స్వచ్చంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలలో భాగంగా పాణ్యం మండల ప్రజలకు అందుబాటులో అంతిమయాత్రకు అవసరమైన శాంతి రథాన్ని ఆర్‌జిఎం విద్యా సంస్థల చైర్మన్ తనయుడు మిద్దె శివరాం శుక్రవారం ప్రారంభించారు. ఈ వాహనానికి ఆర్‌జిఎం విద్యా సంస్థల చైర్మన్ తనయుడు మిద్దె శివరాం రూ. 3 లక్షల 50 వేలు, పాణ్యం మాజీ సర్పంచ్ పుల్లయ్య 1 లక్షా 20 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలకు సంఘం సభ్యులు అమ్మవారి శాలలో ఘనంగా సన్మానం చేశారు. మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని ఉపయోగకరమైన పనులు చేస్తామని అధ్యక్షుడు వాసుదేవ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సభ్యులు చింతా గోపి, మాజీ సర్పంచి పుల్లయ్య, ప్రగతి సుధాకర్, కృష్ణ రెడ్డి, వన్నం బాలకృష్ణ, నారాయణ, గురు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చీ యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మిర్చీ యార్డును ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రేడర్లు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన మిర్చి దిగుబడులను వారు కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలను అందిస్తున్నారని చెప్పారు. భవిష్యత్తులో నంద్యాల మిర్చి యార్డ్‌ను మరింత అభివృద్ధి చేస్తామని, అవసరమైతే మార్కెట్ యార్డుకు ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి మిర్చి రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు, అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా బేతంచెర్ల మండలం

- నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఎడ్యుకేషన్ హద్దుగా మార్చుతామని నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి తెలిపారు. బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ 2023 సంవత్సరం పన్నుల వసూలు, 2024వ సంవత్సరానికి పన్నుల వసూల అంచనాను వివరించారు. బేతంచెర్ల నగర పంచాయతీ 2023, 2024 సంవత్సరానికి భారీ అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ నివేదికలను ఏకగ్రీవంగా కౌన్సిల్ సభ్యులందరూ ఆమోదించారు. అనంతరం చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ బేతంచర్ల మండలంలో జూన్, జూలై మాసాలలోపు పాలిటెక్నిక్ కళాశాల, విద్యా బోధన, త్వరలో కేంద్రీయ విద్యాలయంను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే వర్షాకాలంలోపు గోరుకల్లు రిజర్వాయర్ నుండి బేతంచెర్ల మండలంలోని అన్ని గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో నగర పంచాయతీ సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ నాయక్, హౌస్ ప్లానింగ్ ఆఫీసర్ అజాద్ భాష, సిఓ శ్రీదేవి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు, చింతల నాగిరెడ్డి, జ్యోతి, మొబీనా, అందాన, కుమారి, మహేశ్వరి, ఆంజనేయులు, రాంగోపాల్, ఆఫీస్ సిబ్బంది సుజాత, రమణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దృశ్యం

మోడీ విధానాలను ప్రతిఘటిద్దాం

(5వ పేజీ తరువాయి..) పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగన్న ఎఐకెఎస్ జెండాను ఊపి ఢిల్లీ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ మోడీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ ఉద్యమంలో కార్మిక కర్షక కష్టజీవులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు యాదాటి నాగేంద్రుడు, పి.వెంకటేశ్వర్లు, టి.రామచంద్రుడు, టి.వెంకటేశ్వరరావు, వీరన్న, సిఐటియు పట్టణ కార్యదర్శి డి.రామ్ నాయక్, నాయకులు ఎ.సురేంద్ర, ఏ.రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్.స్వాములు, నరసింహ నాయక్, ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు జి.నాగేశ్వరరావు, ఎపి చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు చందా వారి వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు, మహిళా సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **సిఐటియు ఆధ్వర్యంలో :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌లు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన ఢిల్లీలో జరిగే పోరాట ప్రదర్శనకు ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఆత్మకూరు పట్టణం నుంచి తరలి వెళ్లారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, విజయలక్ష్మి, ప్రమీలమ్మ, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సిఐటియు నాయకులు సురేంద్ర, సీనియర్ పాత్రికేయులు జోసఫ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని సిఐటియు శ్రీశైల మండల నాయకులు ఎం.చిన్న మారన్న, సహాయ కార్యదర్శి ఎం.మల్లికార్జునలు శుక్రవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగే ప్రదర్శనకు ప్రజలు టేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పి.పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం ప్రాజెక్టు : చలో ఢిల్లీకి వెళ్తున్న నాయకులు

పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మూడవ విడత వైయస్సార్ ఆసరా కార్యక్రమాన్ని దొర్నిపాడు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపిఎం బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం మండలంలోని 347 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి ఒక కోటి 93 లక్షల 43 వేల 258 రూపాయల చెక్కును పొదుపు మహిళలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి శకుంతలరెడ్డి, ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు భూమా చెంచి రెడ్డి, ఎంపీడీవో నాగ అనసూయ, కొండాపురం సర్పంచ్ మాధవి లత, బత్తుల నాగేశ్వర యాదవ్, ఎంపీటీసీ లక్ష్మీదేవి, శివరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఉయ్యాలవాడలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్లో పొదుపు మహిళలకు వైఎస్ఆర్ ఆసరా పథకం చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, ఎంపీపీ బుడ్డ భాగ్యమ్మ, జెడ్పిటిసి పుణ్య లక్ష్మి దేవి, ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, ఉయ్యాలవాడ సర్పంచ్ మేకర్ ఓబులేసు, మాజీ సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, పోచ వెంకటరెడ్డి, గజ్జల కృష్ణారెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ : ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే



ఉయ్యాలవాడలో ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో, మజరా గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం బండి ఆత్మకూరు మండల సర్వసభ్య సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి అవసరాలకు ఎక్కడైనా నిధులు కావాలన్నా, రిపేర్లు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన పనులపై నివేదికలను వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌సి లక్ష్మీనరసింహ మాట్లాడుతూ బండి ఆత్మకూరులోని కొత్త కొట్టాల కాలనీ డ్రైనేజ్ సమస్య పరిష్కారం కోసం కోటి రూపాయలు మంజూరు చేశారని, ప్రస్తుతం రూ. 50 లక్షల నిధులతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అంగన్వాడీ సూపర్వైజర్ నజీరా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. బండి ఆత్మకూరు పిహెచ్సి డాక్టర్ భావన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలో కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయని, కుక్కలు పునరుత్పత్తి కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ అధికారి స్వాతి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 28 వేల హెక్టార్లు పూర్తిగా సాగు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా 395 మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవగుప్త, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాగాల వెంకటరమణ, ముంతల మధురాని, పరమటూరు సహకార సంఘం అధ్యక్షుడు శివలింగం, హౌసింగ్ ఏఈ శంకర్ రెడ్డి, పిఆర్ఏఈ వెంకటయ్య, ఏవో హనీఫ్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి డి.చిన్న సంజీవరెడ్డి

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

ప్రజాశక్తి - బనగానపల్లె

మద్యం కేసులో పట్టుబడిన వాహనాలను నేడు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మద్యం కేసులో పట్టుబడిన 4 బైకులు, 2 ఆటోలకు పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వేలంపాటలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలం పాట డబ్బుతో పాటు జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు వేలంపాటల్లో పాల్గొనాలని కోరారు.

కరువు రైతు చూపు.. మొక్కజొన్న వైపు

- ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

- ఎకరాకు 30 నుంచి 40 కింటాళ్ల దిగుబడి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కరువు రైతు చూపు మొక్కజొన్న వైపు చూస్తున్నారు. వ్యయం తక్కువ అధిక దిగుబడి, అధిక ఆధాయం వస్తుండటంతో రైతులు మొక్కజొన్న సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. రైతుల్లో ఈ మార్పు తేవడానికి కోయిలకుంట్ల మండలం పరిధిలోని బిజినవేముల గ్రామానికి చెందిన రైతు పలుకూరి కృష్ణయ్య శ్రీరామ సీడ్స్ 609 రకం మొక్క జొన్నను సాగు చేసి అధిక దిగుబడిని సాధించడమే. ఈ నేపథ్యంలో శుక్రవారం కృష్ణయ్య పొలంలో శ్రీరామ సీడ్స్ కంపెనీ వారు కోయిలకుంట్ల ఉషా ఏజెన్సీ వారి సహకారంతో మొక్కజొన్న పైరు మీద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణయ్య మొక్కజొన్నను సాగు చేసి దిగుబడి సాధించడంతో గ్రామంలో దాదాపుగా 90 శాతం మంది రైతులు ఆయనను ఆదర్శకంగా తీసుకుని ఈ రకం మొక్కజొన్న సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పొలంలో శ్రీరామ సీడ్స్ 609 రకం మొక్కజొన్నను సాగు చేయగా 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీ రామ 609 ప్రత్యేకతలు : శ్రీరామ 609 రకం రైతులకు వరం లాంటిదని శ్రీరామ సీడ్స్ ఎపి ఏరియా ఇన్చార్జ్ గౌస్ మహ్మద్, రాయలసీమ ఇన్చార్జ్ భాషాలు పేర్కొన్నారు. 609 రకం మొక్కజొన్న దిగుబడిని పరీక్షించారు. 609 రకం రంగు నిండు ఆరంజ్ రంగులో ఉంటుందని, బద్ద గింజ వస్తుందని, బెండు చాలా సన్నగా ఉంటుంద వారు వివరించారు. ఈ కంకిని రైతులు తూకం వేసి చూశారని, ఒక్క కంకి 320 గ్రాముల బరువు వచ్చిందని, గింజలను తీసి తూకం వేస్తే 275 గ్రాములు వచ్చిందని తెలిపారు. ఈ లెక్కన రైతుకు ఎకరాకు 35 నుంచి 40 కింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీరామ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు గౌస్ సంద, అల్లా బకాస్, ఉషా ఏజెన్సీస్ ప్రొప్రైటర్ హుస్సేనయ్య పాల్గొన్నారు.

రైతును సన్మానిస్తున్న కంపెనీ ప్రతినిధులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు

సొంత భవనం ఏర్పాటు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి సొంత భవనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్‌లు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయంలో ఆర్ఐ మహేశ్వర్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కావడం హర్షించదగ్గ విషయమని, అయితే ఈ సంవత్సరం ప్రారంభమైన డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కొన్ని తరగతి గదులలో నిర్వహిస్తున్నారని, వాటి వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాబోవు విద్యా సంవత్సరంలో పాణ్యం చుట్టుపక్కల ఉన్న 18 గ్రామాల నుండి దాదాపు 2 వేల మంది విద్యార్థులకు పైగా డిగ్రీ విద్యార్థులు ఉండే అవకాశం ఉందని, ఈ విద్యార్థులందరూ కూడా పాణ్యం నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక దగ్గరలో ఉన్న నంద్యాల, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్న పరిస్థితి ఉందన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి డిగ్రీ కళాశాలకు విశాలమైన తరగతి గదులతో సొంత భవనం, విశాలమైన క్రీడ మైదానం ఏర్పాటు చేయాలని, దాదాపు 20 ఎకరాలను కళాశాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, కార్తీక్, వంశీ, మహేంద్ర, జయంత్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేత

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని కొలిమిగుండ్ల, చింతలాయపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలకు రాంకో సిమెంట్స్ ఫ్యాక్టరీ ప్రెసిడెంట్ శ్రీ రెడ్డి నాగరాజు కంప్యూటర్లు, ప్రింటర్లు శుక్రవారం అందజేశారు. అలాగే పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు మాట్లాడుతూ రాంకో సిమెంట్స్ విద్యార్థులకు ఉపయోగ పడే కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషమని అన్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రవి కుమార్, వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, నాయకులు అంబటి చంద్రమోహన్ రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు అంబటి ప్రకాశ్ రెడ్డి, హెచ్‌ఎంలు సోమశేఖర్, బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నష్టపరిహారం చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - రుద్రవరం : అడవి జంతువుల వల్ల పంట నష్టపోయిన రైతుకు నష్టపరిహార చెక్కులను చలమ రేంజ్ అధికారి ఈశ్వరయ్య శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చలమ రేంజ్ పరిధిలోని గున్నంపాడు గ్రామానికి చెందిన రైతు రామాంజనేయ రెడ్డికి చెందిన పొలం అడవి జంతువుల బారిన పడి పంట నష్టపోయాడన్నారు. దీంతో రైతు నష్టపరిహారం చెల్లించాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. స్పందించిన జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వినీత్ కుమార్ రూ.5400 చెక్కును ఇవ్వగా రైతుకు అందజేశామన్నారు. కార్యక్రమంలో పెద్ద కంబలూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.



నష్టపరిహార చెక్కును అందజేస్తున్న అధికారులు

సమయపాలన పాటించకుంటే చర్యలు : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని డిఎల్‌డిఒ జనార్ధన్ రావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వేంపెంట, బానకచర్ల, ఎర్రగుడూరు, చెలిమిల్ల, మద్దూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. సచివాలయాలను, పాఠశాలల్లో నాడు-నేడు పనులను, జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. పాఠశాలలలో నాడు-నేడు కింద పనులలో రన్నింగ్ వాటర్, టాయిలెట్స్, మినరల్ వాటర్ తదితర వాటిని పరిశీలించారు. సచివాలయ ఉద్యోగస్తులు అటెండెన్స్‌ను పరిశీలించారు అనంతరం వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వేలను పూర్తి చేయాలని, స్పందనలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా పని చేయాలన్నారు. విధులకు సక్రమంగా హాజరుకాకుంటే బయో మెట్రిక్ అధారంగా పర్సంటేజీ ప్రకారం శాలరీ వస్తుందని సూచన చేశారు. కార్యక్రమంలో ఎస్‌బిసిసి విజయ్ కుమార్, ఎంపిడిఒ సుమిత్రమ్మ, ఎంఇఒ బాలాజీ నాయక్, హౌసింగ్ ఎఇ శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి



సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి : ఎంపీ

ప్రజాశక్తి - నంద్యాల

కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ రైతులకు, ప్రజలకు అందించే సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అధ్వర్యంలో నంద్యాల రైల్వే స్టేషన్‌లోని కార్మికులు, హమాలీల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న 300 మందికి హమాలీలకి వైద్య పరీక్షలు ఉదయానంద హాస్పటల్ వైద్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డీఏఓ మోహన్ రావు, ఏడీఏ రాజశేఖర్, ఎంఏఓ స్వప్నిక, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు డీజీఎం గోవిందరావు, సీనియర్ అగ్రానమిస్ట్ టి.శ్రీదర్ రెడ్డి, నంద్యాల మార్కెటింగ్ ఆఫీసర్ పీ.శ్రీదర్ రెడ్డి, ఎంఓ అదానోయి, రఘు కుమార్, డీలర్లు, సీజీఎస్ నాగమణి, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

సంజామల-కొత్తపల్లి రోడ్డును బాగు చేయండి

ప్రజాశక్తి - సంజామల

సంజామల నుంచి కొత్తపల్లికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సంజామల గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు. శుక్రవారం గ్రామస్తులు మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు వెళ్లాలంటే కంకర తేలి ఉండడంతో కింద పడుతున్న పరిస్థితి ఉందన్నారు. సంబంధిత అధికారులకు చాలాసార్లు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. పొలాలకు వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉందని, నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేదన్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేసి ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చూడాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

చెన్నకేశవ స్వామికి శంకు చక్రం విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామంలో చెన్నకేశవ స్వామి దేవస్థానానికి పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా మోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంజి. నాగేశ్వరి, విజయ మనోహర్ రాజు కుమార్తె హిమబిందు రూ. 50 వేలు విలువ చేసే శంకు చక్రం, నామాలు శుక్రవారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి చేతుల మీదుగా విరాళంగా ఇచ్చారు. అనంతరం గుండం శేషి రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు శాలువాతో గుండంశేషి రెడ్డిని సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జగదీశ్వర్ రెడ్డి, రాఘవయ్య, వడ్డే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఎట్టి మాల సుశీలమ్మ (60) విద్యుత్ షాక్ మతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఇటిక్యాల గ్రామంలోనే కోళ్ల ఫారం కాలనీలో సుశీలమ్మ ఇంటి ముందు కంపచెట్లను తొలగిస్తుండగా పక్కనే ఉన్న 33 కెవి విద్యుత్తు లైనుపై కంపచెట్లు పడ్డాయి దీంతో విద్యుత్ షాక్ గురైన సుశీలమ్మను ఆసుపత్రి తరలించగా అప్పటికే

కబడ్డీ పోటీల విజేత అయ్యకొండ జట్టు

ప్రజాశక్తి - పగిడ్యాల : శ్రీరామ నవమి పండగను పురస్కరించుకొని పగిడ్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీలలో అయ్యకొండ జట్టు మొదటి స్థానంలో నిలిచి రూ. 20 వేలు కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో శకునాల జట్టు రూ. 15 వేలు, కొంతలపాడు జట్టు మూడవ స్థానంలో రూ. 12 వేలు, నాలుగవ స్థానంలో వడ్డెమాను జట్టు రూ. 10 వేలు, ఐదవ స్థానంలో వెలుగోడు జట్టు రూ. 8 వేలు, ఆరవ స్థానంలో శకునాల బి జట్టు రూ. 5 వేలు గెలుపొందాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.

వాలంటీర్ నియామకం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ముత్తలూరు గ్రామంలోని 8వ వార్డుకు వాలంటీర్‌గా నందినిని నియమిస్తూ ఎంపిడిఒ మధుసూదన రెడ్డి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటర్వ్యూ నిర్వహించి నందినిని ఎంపిక చేసినట్లు తెలిపారు.